విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి
- కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

జనగామ చౌరస్తా, ఆగస్టు 30 : విష జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం జనగామ పట్టణంలోని 7, 10వ వార్డులోని వీధుల్లో ఆయన పర్యటించారు. అంతర్గత రోడ్లపై నిలిచిన వర్షపు నీటితోపాటు డ్రైనేజీలను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. కాలనీలో డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్న రోగులను కలిసి మనోధైర్యం కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై పేరుకున్న చెత్తతో పాటు పిచ్చి మొక్కలను తొలగించాలని ఆదేశించారు. డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా వంటి విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని షేక్ రిజ్వాన్‌బాషా సూచించారు. జ్వరం, దగ్గు, జలుబు ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలన్నారు. వ్యాధుల నిర్ధారణకు రక్తపరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. తాజా కూరగాయలు, పండ్లను ఆహారంగా తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వార్డు అధికారి సదానందం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపయ్య, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

బచ్చన్నపేట: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం మండలంలోని తమ్మడపల్లిలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు చెత్తా చెదారాన్ని రోడ్లపై, మురుగు కాల్వల్లో పడేయకుండా సేకరణ ట్రాక్టర్‌కు అందించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సౌజన్య, కారోబార్ నాగయ్య పాల్గొన్నారు. కాగా, ఆలింపూర్‌లో డ్రై డే నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో కారోబార్ మురళి, ఏఎన్‌ఎం మమత, సంపూర్ణ, రజిత, ఆశావర్కర్లు ప్రమీల, స్వప్న డ్రైనేజీ కాల్వల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

జనగామలో మురుగునీటి ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

నేడు జనగామకు హైకోర్టు న్యాయమూర్తి

జనగామ చౌరస్తా/పాలకుర్తి రూరల్ : రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నంద శనివారం జనగామకు రానున్నారని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి డీ రవీంద్రశర్మ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9గంటలకు జనగామ కోర్టు ఆవరణలోని మహిళా అడ్వకేట్స్ రూమ్, ఈ–లైబ్రరీ ప్రారంభిస్తారని తెలిపారు. బ్యాడ్మింటన్ షటిల్ కోర్ట్ సందర్శించి, రక్తదాన శిబిరం పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం జిల్లా జ్యుడీషియల్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్‌ను నంద నిర్వహిస్తారని తెలిపారు. అలాగే, పాలకుర్తి మండలంలోని పర్యాటక ప్రాంతాల్లో హై కోర్టు జడ్జి నంద శనివారం పర్యటిస్తారని జనగామ ఏడీజే జడ్జి కే సందీప తెలిపారు. హై కోర్టు జడ్జి పర్యటన నేపథ్యంలో ఆమె శుక్రవారం పాలకుర్తిలోని సోమేశ్వర లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంతోపాటు బమ్మెర పోతన స్మృతివనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైకోర్టు జడ్జి నంద శనివారం బమ్మెరలోని పోతన మాత్యుడి స్మృతివనాన్ని సందర్శించి సమాధి వద్ద నివాళులర్పిస్తారని తెలిపారు. అనంతరం పాలకుర్తిలోని సోమేశ్వర లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారని చెప్పారు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్తారన్నారు. హైకోర్టు జడ్జి పర్యటన నేపథ్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

రఘునాథపల్లి, ఆగస్టు 30: మండలంలోని భాంజీపేటకు చెందిన మాటూరి రమేశ్ ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబాన్ని బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్ పరామర్శించారు. బీసీ కార్పొరేషన్ నుంచి రూ.25వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన మాట్లాడుతూ గీత కార్మికులు తాటిచెట్టు ఎక్కేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గౌడ సంక్షేమ రాష్ట్ర అధ్యక్షుడు వంగ సదానందం నాయకులు బుర్ర లక్ష్మీనారాయణ, గైని శ్రీనివాస్, రచ్చ సోమనాథం, పుల్లా వెంకటేశ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED HOSPITAL STAFF
★Pharmacy Boys, Operation Theater Boys & Receptionist / సిస్టమ్ ఆపరేటర్స్ కావలెను. సంప్ర: గార్డియన్ హాస్పిటల్, ములుగు 'X' రోడ్, వరంగల్. 12 to 2 PM.
NTW-0418

BUSINESS OFFER
★చాలా పెద్ద చదువులు చదువుకున్న నిరుద్యోగ యువతీ, యువకులకు సువర్ణావకాశం. అతి తక్కువ పెట్టుబడితో ప్రతి నెల అత్యధికంగా సంపాదించుకునే సువర్ణావకాశం. సంప్ర: సెల్: 9502940056.
NTW-326315

PLOTS FOR SALE

★వరంగల్ నాయుడు పెట్రోల్‌పంప్, వరంగల్ నుండి ఖమ్మం హైవే రోడ్‌కు దగ్గరలో 248 చ.గ.లు Size: 64x35, 33 ఫీట్ల రోడ్ గల ప్లాట్ అమ్మబడును. సంప్ర: 9676147575
NTW-323349

To-Let / Rent
⋆ 3BHK Residence 2400 Sft. Semi Furnished as per vastu, Lift & Generator, Car Parking available for Rent @ Reddy colony near Vikas H.School, HNK. 8886996262.
KMM-

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

ఎల్ఆర్ఎస్‌పై మాట తప్పిన కాంగ్రెస్

- హామీలను విస్మరించి దరఖాస్తుదారుల నుంచి డబ్బుల వసూలు
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల ఆగ్రహం

సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, అధికారులను నిలదీస్తున్న హరిశ్చంద్రగుప్తా

జనగామ, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : తాము అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ ప్రక్రియను ఉచితంగా అమలు చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పలువురు కౌన్సిలర్లు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దరఖాస్తుదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నదని మండిపడ్డారు. శుక్రవారం జనగామ మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ పోకల జమున అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ ఫ్లోర్‌లీడర్ మహంకాళి హరిశ్చంద్రగుప్త మాట్లాడారు. ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ మాట తప్పిందని విమర్శించారు. పట్టణంలో అనేక మంది డెంగ్యూ వైరల్ ఫీవర్ బారినపడ్డారని, ఇప్పటికైనా సంబంధిత వైద్యులు ముందు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పేరుకే జిల్లా ఆస్పత్రి ఉన్నా డాక్టర్లు అందుబాటులో ఉండడంలేదని, సీటీ స్కాన్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కాంగ్రెస్ సభ్యుడు రామచంద్రం మాట్లాడుతూ మున్సిపాలిటీలో షెట్టర్లకు (మడిగలు) ఎందుకు టెండర్ వేయడం లేదని అధికారులను నిలదీశారు. బీఆర్ఎస్ సభ్యురాలు బండ పద్మ, సుమలత, పాండు, కాంగ్రెస్ సభ్యులు జక్కుల అనిత మాట్లాడుతూ తమ పరిధిలోని వార్డుల్లో అభివృద్ధి పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయినా పనులు ప్రారంభించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సభ్యురాలు గుర్రం భూలక్ష్మి మాట్లాడుతూ స్వచ్ఛదనం–పచ్చదనం పేరిట అవార్డులు ఇస్తామని చెప్పిన అధికారులు తర్వాత దాట వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సభ్యుడు బొట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ అవార్డులు పారదర్శకంగా ఉండాలన్నారు. కలెక్టరేట్‌లో పైరవీకారులు రెకమండ్ చేసిన వారికే అవార్డులు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ సభ్యురాలు ఉడుగుల శ్రీలత మాట్లాడుతూ స్లమ్ ఏరియాలో ఉన్న తమ వార్డు పరిధిలో తాగునీటి సమస్య ఉందని, వెంటనే ట్యాంకర్ ఏర్పాటు చేయాలన్నారు. బీఆర్ఎస్ సభ్యురాలు మల్లిగారి చంద్రకళ మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బందికి యూనిఫాం (బట్టలు), నూనె, చీపుర్లు అందజేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సభ్యురాలు పాకరమ మాట్లాడుతూ అండర్ బ్రిడ్జి వద్ద ఇబ్బందికరంగా ఉందని, గతంలో అనేకసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న వారు లేరన్నారు. పట్టణంలోని 2, 3, 4, 27 వంటి వార్డుల్లో అంగన్‌వాడీ కేంద్రాలు లేవని వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా వార్డుల కౌన్సిలర్లు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో గంజాయి సేవించే వారి సంఖ్య పెరుగుతున్న క్రమంలో యువత మత్తులో జోగుతున్నదని తెలిపారు. పాఠశాల ప్రాంతాలు, వివిధ ముఖ్య కూడళ్లలో మందుబాబులు వీరంగం చేస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. మొత్తం 15 ఎజెండా అంశాలతోపాటు 6 టేబుల్ అంశాల్లో ఒకటి తిరస్కరించిన కౌన్సిల్ మిగిలిన 20అంశాలను ఆమోదించింది. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి : పల్లా

చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ రూరల్, ఆగస్టు 30 : అర్హులందరికీ ప్రభుత్వం నుంచి అమలయ్యే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. జనగామలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పల్లా మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తప్పకుండా సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరగోని యాదగిరి గౌడ్, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు చినబోయిన రేఖ, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుడు స్వామినాయక్ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు పరిధిలోకి అబ్దుల్లా బాబా దర్గా

జనగామ చౌరస్తా, ఆగస్టు 30 : జనగామ పట్టణంలోని అబ్దుల్లా బాబా దర్గాను శుక్రవారం జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి బీ రవీందర్ సమక్షంలో స్టేట్ వక్ఫ్ బోర్డు టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనపర్చుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దర్గాను ముతావలి నుంచి దర్గాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇకపై దర్గా అభివృద్ధి, నిర్వహణ వక్ఫ్‌బోర్డు పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్ పాల్గొన్నారు..

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పింకేశ్‌కుమార్

అప్‌గ్రేడ్ పనులు నాణ్యతతో చేపట్టాలి

అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

పాలకుర్తి రూరల్, ఆగస్టు 31: అంగన్‌వాడీ కేంద్రాల్లోని అప్‌గ్రేడ్ పనులను నాణ్యతతో చేపట్టాలని అదనపు కలెక్టర్ ఫర్మర్ పింకేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో దర్దేపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ చిన్నారులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. పరిసరాల్లో, ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూస్తే దోమల వృద్ధి ఉండదన్నారు. టైర్లు, పాత వస్తువులు, కూలర్లు, కొబ్బరి బోండాలని, డ్రైనేను పాటించాలని ఆయన సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల భవన మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామని, ఇందుకోసం ఎస్టిమేట్ వేయాలని ఏఈని ఆదేశించారు, ఆయన వెంట జిల్లా శిశు సంక్షేమాధికారి జయంతి, ఎంపీడీవో ఆవుల రాములు, పంచాయతీ కార్యదర్శులు వెంకటాచారి, జయశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్త బండి వాణి ఉన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ పల్లకీ ఊరేగింపు

జనగామ, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని వీధుల్లో పల్లకీ ఉత్సవ ఊరేగింపు కనుల పండువగా జరిగింది. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో ప్రబోధ సేవాసమితి – హిందూ జ్ఞాన వేదిక–త్రైత సిద్ధాంతం కమిటీ సభ్యులు పోలోజు నర్సింహచారి–రమాదేవి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి నుంచి పూజలు అందుకున్న శ్రీకృష్ణ భగవానుడు చివరిరోజు పల్లకిలో భక్తుల కోలాటాలు, మేళతాళాల మధ్య వీవర్స్‌కాలనీ నుంచి గ్రెయిన్ మార్కెట్ వరకు ఊరేగింపు జరిగింది. జనగామ, భువనగిరి, చేర్యాల కమిటీ సభ్యులు చిలుమోజు సోమయ్య, ఎనగందుల వెంకటేశ్, రవీందర్, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, సంతోశ్, మల్లేశ్, పోలోజు ఉప్పయ్య, కనకయ్య, శ్రీనివాస్, రాజు, మురళి, రోహిత్ పాల్గొన్నారు.

జనగామ పట్టణంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

రుణమాఫీ కోసం బ్యాంకుల ముందు రైతుల నిరీక్షణ

స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరులో బ్యాంకుల వద్ద ఆందోళన

శివునిపల్లి బరోడా బ్యాంకు ఎదుట రైతులు

చిల్పూరులో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 30 : రూ.2 లక్షల లోపు పంట రుణాలు రైతులందరికీ మాఫీ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచి ఎదుట పెద్ద సంఖ్యలో రైతులు బారులు తీరారు. జఫర్‌గఢ్ మండలానికి చెందిన రైతుల బ్యాంకు ఖాతాలు బరోడా బ్రాంచిలో ఉన్నాయి. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల లోపు పంట రుణాలు అర్హులైన రైతులందరికీ మాఫీ కాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల వరకే బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచికి చేరుకున్నారు. 10 గంటలకు బ్యాంకు అధికారులు ఇచ్చే టోకెన్ల కోసం క్యూలో నిల్చున్నారు. టోకెన్ నంబర్‌ను ఎప్పుడు పిలుస్తారోనని తిండి తిప్పలు లేకుండా వేచి చూశారు.

షరతులు లేకుండా మాఫీ చేయాలి

చిల్పూరు : షరతులు లేకుండా రైతులకు రూ.2 లక్షలలోపు పంట రుణాలు మాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చిల్పూరులోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయాలన్నారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ మహేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలు సంపత్, అపరాదపు రాజు, సాదం శ్రీనివాస్, ఈరడి రవి, మల్లయ్య, మొడిక భీమయ్య, ఉరడి రవి, ఆవుల ప్రభాకర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పురోహితుడు మృతి



రామచంద్రమూర్తి (ఫైల్)

రఘునాథపల్లి, ఆగస్టు 30 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పురోహితుడు మృతి చెందిన ఘటన మండలంలోని నిడిగొండలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన పురోహితుడు ఎల్లబంట్ల రామచంద్రమూర్తి జనగామ నుంచి గురువారం రాత్రి బైక్‌పై వస్తున్న క్రమంలో నిడిగొండ బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన రామచంద్రమూర్తిని చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించగా శుక్రవారం మృతి చెందారని ఎస్సై దూదిమెట్ల నరేశ్‌యాదవ్ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆయన మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

పెంబర్తిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో మహిళలు

గుండ్లగడ్డలో పూజలు చేస్తున్న మహిళలు

లక్ష్మీదేవికి శ్రావణమాస పూజలు

జనగామ, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ)/జనగామ రూరల్ : శ్రావణమాసంలో చివరి శుక్రవారం సందర్భంగా జిల్లా కేంద్రంలోని గుండ్లగడ్డ ప్రాంతంలో మహిళలు లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. చుంచు రేణుకాదేవి నివాసంలో ముత్తయిదువులకు వాయనం, తాంబూలాలు ఇచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా లలితా సహస్ర పారాయణం, విష్ణు సహస్ర పారాయణం పఠించారు. కార్యక్రమంలో హైమ, జ్యోతి స్వాతి రెడ్డి, రజిత, సిరి, సౌమ్య, రాణి పాల్గొన్నారు. జనగామ మండలంలోని పలు ఆలయాల్లో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. పెంబర్తిలోని మహమ్మయి ఆలయంలో అమ్మవారికి గాజులతో అలంకరించారు. సీతారామస్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు, లక్ష పుష్పార్చన నిర్వహించారు. భక్తులకు పూజారి నాగరాజుశర్మ తీర్థ ప్రసాదాలు అందించారు.



పెంబర్తిలో లక్షపుష్పార్చన, గాజుల అలంకరణలో అమ్మవారు

ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

మృతుడి కుటుంబానికి స్నేహితుల చేయూత

రఘునాథపల్లి, ఆగస్టు 30: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని వెల్దికి చెందిన నక్కల ఉపేందర్ మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న స్నేహితులు మృతుడి కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. తమవంతు సాయంగా రూ.20వేలు అందించారు. వారు మాట్లాడుతూ ఉపేందర్ అందరితో కలివిడిగా ఉండేవారని, ఆయన మృతితీరని లోటు అన్నారు. చెరుకు రాజు, పాశం మహేందర్, జీడికంటి రాజు, దున్నపోతుల రవి, పెండ్లి యుగేందర్, పొట్లపల్లి వీరేందర్, రాసమల్ల లింగస్వామి, గువ్వ రాజు, బోయిని కృష్ణమూర్తి, యాదగిరి, నక్కల సోమరాజు, బెజ్జం భాస్కర్, కీర్తి వెంకటేశ్వర్లు, గుడిపాటి తిరుపతి పాల్గొన్నారు

తీజ్ వేడుకల్లో గిరిజన యువతులు

జాటోత్ తండాలో తీజ్ వేడుకలు

దేవరుప్పుల, ఆగస్టు 30: మండలంలోని ధర్మాపురం రెవెన్యూ పరిధిలోని జాటోత్ తండాలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న తీజ్ ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. గిరిజన సంప్రదాయ పద్ధతిలో యువతులు ఆటపాటలతో వేడుకలు నిర్వహించారు. ఇంటింటికీ బంధుమిత్రులు తరలిరాగా వైభవంగా ఉత్సవాలు కొనసాగించారు. అవివాహిత యువతులు మంచి వరుడు రావాలని దేవతను కొలిచే ఈ పండుగ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారం క్రితం మట్టిలో గోదుమలు పోయడంతో నారుగా ఎదుగగా అమ్మవారికి సమర్పించారు. రైతు కుటుంబాలు పాడిపంటలతో ఆనందంగా ఉండాలని కోరుతూ పూజలు చేశారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన పెంచుకోవాలి

జనగామ రూరల్, ఆగస్టు 30 : కళాశాలలో అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థి వ్యక్తిత్వ వికాసంపై అవగాహన పెంచుకోవాలని క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఫాదర్ విజయ్‌పాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని యశ్వంతాపూర్‌లోని కళాశాలలో డిప్లొమా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అతిథిగా నగ ప్రసాద్ హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రొఫెషనల్ కోర్సులను ఎలా అధ్యయనం చేయాలి, సమాజంలోని వ్యక్తులతో ఎలా వ్యవహరించాలి, వివిధ సంస్థల్లో ఉద్యోగం పొందాలంటే వృత్తి నైపుణ్యాన్ని ఎలా పెంచుకోవాలని అనే అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో దాత కవిత మల్లారెడ్డి దంపతులు

కాళ భైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

బచ్చన్నపేట, ఆగస్టు 30 : మండలంలోని కొడవటూరు సిద్ధేశ్వరస్వామి ఆలయ వంటశాల సమీపంలో శుక్రవారం కాళభైరవస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దాతలు కవిత–మల్లారెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు సంజీవరెడ్డి హాజరుకాగా పూజారులు పూజలు చేశారు. సిద్ధేశ్వరుడిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు గుట్ట కింద ఉన్న భైరవస్వామి ఆలయం వద్దకు వచ్చి మొక్కులు చెల్లించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో వంశీ తెలిపారు. ఇందుకు మల్లారెడ్డి సహకారం ఎంతో ఉందన్నారు. అర్చకులు సంప్రదాయరీతిలో విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా కవితామల్లారెడ్డి మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా సిద్ధేశ్వరస్వామి సన్నిధిలో సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది శ్రీనివాస్, చల్లా రాజేందర్‌రెడ్డి, భానుప్రకాశ్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కట్కూర్ పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

బచ్చన్నపేట, ఆగస్టు 30 : మండలంలోని కట్కూర్ ప్రాథమిక పాఠశాలకు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు శుక్రవారం ప్రింటర్‌ను బహూకరించారు. ఉద్యోగ విరమణ పొందిన హెచ్ఎం ప్రభాకర్, బదిలీపై వెళ్లిన యాదగిరి, రాంరెడ్డి, పరశురాం, విజయలక్ష్మి కలిసి రూ.10వేల విలువైన ప్రింటర్‌ను అందించారు. కార్యక్రమంలో ప్రభాకర్, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ దీపారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆయాలను సత్కరిస్తున్న సీడీపీవో రమాదేవి

అంగన్‌వాడీల్లో ఆయాల సేవలు మరువలేనివి

ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి

బచ్చన్నపేట, ఆగస్టు 30 : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాల సేవలు మరువలేనివని ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి, సూపర్‌వైజర్ మనోహర అన్నారు. శుక్రవారం మండలంలోని బండనాగారం, ఆలింపూర్, కేశిరెడ్డిపల్లి, బోనకొల్లూరులో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన ఆయాలను సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకువచ్చే బాధ్యత వారిదేనన్నారు. కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ కిచెన్ గార్డెన్ల నిర్వహణ చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ మండల అధ్యక్షురాలు గణపురం కవిత, జిల్లా నాయకురాలు సుంకోజు రజిత, ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించిన డీపీవో

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 30 : ఓటరు జాబితా ఆన్‌లైన్ ప్రక్రియను డీపీవో స్వరూపారాణి శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పరిశీలించారు. దీనిని త్వరగా పూర్తి చేసి వచ్చే నెల 6న ఓటరు జాబితాను జీపీల్లో ప్రదర్శించాలని పంచాయతీ కార్యదర్శులకు, బీఎల్‌వోలకు సూచించారు. వచ్చే నెల 13వరకు సవరణకు ఓటరు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ఇంటి పన్నులను ఆన్‌లైన్ చేశామని తెలిపారు. షాపులకు, ట్రేడర్లకు లైసెన్స్‌లు ఇచ్చామని, దీంతో గ్రామ పంచాయతీలకు రెవెన్యూ పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఏదునూరి సత్యం, శ్రీకాంత్, జేసుమణి తదితరులు పాల్గొన్నారు.